క్లుప్తంగా

బోధనోపకరణాలు ఉపయోగించాలి



లింగంపేట(ఎల్లారెడ్డి) : ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు చెప్పే సమయంలో బోధనోపకరణాలు ఉపయోగించి విద్యా బోధన చేయాలని మండల నోడల్ అధికారి షౌకత్‌అలీ సూచించారు. శనివారం ఆయన లింగంపేట మండలం సురాయిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, సురాయిపల్లి తండా ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. నవంబర్ 24న జరిగే నాస్ (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్షకు 3వ, 6వ తరగతుల విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. ఆర్పీ రాములు, హెచ్‌ఎం మధుసూదన్ తదితరులున్నారు.

పీహెచ్‌సీ సందర్శన

సాక్షి ఎఫెక్ట్..

భిక్కనూరు : మండలకేంద్రంలోని పీహెచ్‌సీని డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్ శనివారం సందర్శించారు. 'సాక్షి'లో 'పీహెచ్‌సీలో వెక్కిరిస్తున్న ఖాళీలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించి డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్ భిక్కనూరు ఆసుపత్రికి వచ్చి వైద్యుల, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. 30 మంది ఉద్యోగులకు గాను 15 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని మరో 15 పోస్టులు ఖాళీగా ఉన్న విషయమై 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన వార్త కథనంపై వైద్యురాలు యెమిమాను అడిగి తెలుసుకున్నారు. ఖాళీల విషయమై జిల్లా వైద్యశాఖ అధికారులకు నివేదిస్తామన్నారు.

ఓటరు జాబితా పరిశీలన



నిజాంసాగర్(జుక్కల్) : జుక్కల్ మండల కేంద్రంలోని జీపీ కార్యాలయంలో శనివారం ఓటరు జాబితాను ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన యువకుల ఓటరు నమోదు, ఓటర్లజాబితాలో తప్పులను సరిచేసేందుకు ఆయన తెలుసుకున్నారు. జీపీల వారిగా ఓటరు జాబితాను పకడ్బందీగా సిద్ధం చేయాలని బీఎల్‌వోలను ఆయన ఆదేశించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని బీసీ, ఎస్సీ బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు హిమబిందు ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్యపరీక్షలు చేశారు. ఈ సందర్భంగా రెండు వసతి గృహాల్లో 131 మంది విద్యార్థులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ ఫరీదాబేగం, యాదగిరి, రాజేశ్వరీ, భాగ్య పాల్గొన్నారు.

మైక్‌సెట్ బహూకరణ



ఎల్లారెడ్డి : మండలంలోని అన్నాసాగర్ జెడ్పీ పాఠశాలకు ఉపాధ్యాయులు జోసెఫ్, సిద్దిరామాగౌడ్ శనివారం మైక్‌సెట్‌ను అందించారు. పాఠశాలలో టీచర్‌గా పనిచేసి బదిలీ అయిన జోసెఫ్, సిద్దిరామాగౌడ్‌లు పాఠశాలకు వారి జ్ఞాపకంగా మైక్‌సెట్‌ను అందించారు. కార్యక్రమంలో టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న' ఏజెన్సీల నిరసన



నిజాంసాగర్(జుక్కల్) : జుక్కల్ మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో వంట ఏజెన్సీల నిర్వాహకులు, కార్మికులు నిరసన చేపట్టారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీఐటీయు జిల్లా కమిటి సభ్యుడు సురేశ్‌గొండ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, షేక్ ఫిర్దోస్ ఉన్నారు.

స.హ. చట్టంపై అవగాహన

బాన్సువాడ : పట్టణంలోని సాయికీర్తి జూనియర్ కళాశాలలో శనివారం సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్, మాజీ న్యాయమూర్తి ఏఎం సలీం మాట్లాడారు. మూడు క్రిమినల్ కొత్త చట్టాలపై విద్యార్థులకు వివరించారు. బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి వడ్ల శివరాం, ప్రిన్సిపల్ గంగరాజు, అధ్యాపక బృందం ఉన్నారు.

సంత.. చింత..!

- స్థలం లేక ఇబ్బందులు.. రోడ్డుపైనే విక్రయాలు
- వర్షం పడితే పరిసరాల్లోకి మురికినీళ్లు



లింగంపేటలో రోడ్డు పక్కనే కొనసాగుతున్న సంత

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో సంతకు స్థలం లేక చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దశాబ్దాలు గడుస్తున్నా వ్యాపారుల బతుకులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారింది. ప్రతిఏడాది జీపీకి లక్షల్లో ఆదాయం వస్తున్నా ప్రత్యేక స్థలం కేటాయించకపోవడంలో పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శంగా మారుతున్నాయి. సంతలో కనీసం తాగేందుకు నీరుకూడా ఉండని పరిస్థితి లేదు. దీంతో ఎండనకా వాననకా తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. సంతకు ప్రత్యేక స్థలాలు ఏర్పాటు చేయకపోవడంతో అధికారులు, పాలకులపై ప్రజలు, వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతీఏటా తైబజార్, దడ్వాయి పేరిట రూ. లక్షల్లో వసూలు చేస్తున్నారు. కాని జీపీ పాలకులు, అధికారులు సంత జరుగుతున్న ప్రదేశాల్లో ఎలాంటి సౌకర్యాలు కల్పించలేకపోతున్నారు. కూరగాయల విక్రయదారులు, పండ్లబండ్లు, వస్త్ర దుకాణాలు, ఎండుమిర్చి, నిత్యవసర సరుకుల విక్రయాలతో పాటు అన్ని రకాల చిరు వ్యాపారులు సంతలో విక్రయాలు కొనసాగిస్తున్నారు.

వ్యాపారుల ఆగ్రహం..

తమకు కనీసం తాగునీరు, రేకుల షెడ్లు, ప్రత్యేక స్థలాలు ఏర్పాటు చేయడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో రోడ్డుపై బురదమయమై ఇబ్బందిగా మారుతుందన్నారు. చుట్టు పక్కల నుంచి డ్రెయినేజీ నీరు సంతలోకి ప్రవేశించి తెచ్చిన సరుకులు నీటిపాలై చాలా నష్టపోతున్నామన్నారు. దీంతో నరకయాతన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ దుకాణానికి రూ. 50 వసూలు చేస్తున్నారు. వేసవి కాలంలో ఎండలోనే విక్రయాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రైవేటు స్థలాల్లో దుకాణాలు ఏర్పాటు చేస్తే స్థలం యజమానులు అనుమతులు ఇవ్వడం లేదు. రోడ్డుపైన ప్రయాణికులు, వాహన చోదకుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కనీ సంత జరుగుతున్న స్థలంలో సీసీ రోడ్లు, మురికి కాల్వల నిర్మాణం చేపట్టాలని వ్యాపారులు కోరుతున్నారు.

మురికి నీటిలోనే విక్రయాలు



ఐదేళ్లుగా కూరగాయల వ్యాపారం చేస్తున్నాను. ప్రతి శుక్రవారం లింగంపేట సంతకు కూరగాయాలు తీసుకొస్తాను. సంతలో కనీస వసతులు లేవు తాగునీరు దొరకదు. వర్షం పడితే డ్రెయినేజీ కాల్వ నుంచి మార్కెట్‌లోకి మురికినీరు వస్తుంది. వర్షానికి నానుతున్నాం, ఎండకు ఎండుతున్నాం.. సౌకర్యాలు కల్పించాలి.

– సాయిలు, మోతె

వసతులు కల్పించాలి



15 ఏళ్లుగా వ్యాపారం చేస్తున్నాను. ప్రతివారం లింగంపేట సంతకు సరుకులు తీసుకొనివస్తాను. సంతలో రేకుల షెడ్లు, తాగునీరు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి. వర్షంపడితే సరుకులు తడవకుండా, బురదమయం కాకుండా సీసీ రోడ్డు వేయించాలి. రూ. 50 తైబజార్ ప్రతీ శుక్రవారం కడుతున్నాం. కాని సౌకర్యాలు లేవు.

– ఎండీ గౌస్, ఎల్లారెడ్డి

ప్రైవేట్ ఆస్పత్రి, మెడికల్ షాప్ సీజ్



ప్రైవేట్ ఆస్పత్రిని సీజ్ చేస్తున్న వైద్యశాఖ అధికారులు

భిక్కనూరు : మండల కేంద్రంలో వైద్యం వికటించడంతో వ్యక్తి మృతికి కారణమైన ప్రైవేట్ ఆస్పత్రిని దానిపక్కనే నిబంధనలకు విరుద్ధంగా ఉన్న మెడికల్ షాపును వైద్యశాఖ అధికారులు శనివారం సీజ్ చేశారు. మండల కేంద్రానికి చెందిన పెర్కల స్వామి వైద్యం వికటించి మృతి చెందిన విషయం తెలుసుకున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు దోమకోండ డిప్యూటీ డీఎంఅంహెచ్‌వో ప్రభుకిరణ్, భిక్కనూరు పీహెచ్‌సీ వైద్యురాలు యెమిమా, పీహెచ్‌ఎన్ రాణి, హెల్త్ అసిస్టెంటు సతీష్ మృతుడు స్వామి ఇంటికి వెళ్లారు. అక్కడ మృతుని భార్య శ్యామలను విచారించి ఆమె మాటలను రికార్డు చేశారు. తదుపరి మండల కేంద్రంలో స్వామి మృతికి కారణమైన ప్రైవేట్ ఆస్పత్రి వద్దకు వచ్చి సీజ్ చేశారు. పక్కనే ఉన్న మెడికల్ షాపును తనిఖీ చేశారు. మెడికల్ షాపులో ఫార్మసిస్ట్ లేకపోవడంతో లైసెన్స్ ఉన్నా మరో యువతి మందులు విక్రయిస్తుండడంతో డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మెడికల్ షాప్‌ను సీజ్ చేశారు. సీజనల్ వ్యాదులు ప్రబలుతున్నాయని వీటితో బాధపడుతున్న రోగులకు ఆర్‌ఎంపీ, పీఎంపీలు చికిత్సలు చేయవద్దని డిప్యూటీ డీఎండ్‌హెచ్‌వో ప్రభుకిరణ్ పేర్కొన్నారు. కేవలం సాధారణ వ్యాధులతో వచ్చే వారికే వైద్యం చేయాలని నిబంధనలను పాటించకపోతే కఠినచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు నిర్వహిస్తామని నిబంధనలను పాటించకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

మెట్ల బావి పనుల పరిశీలన



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రం సమీపంలోని నాగన్నగారి మెట్ల బావి అభివృద్ధి పనులను శనివారం పంచాయతీ రాజ్ డీఈ గిరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాగన్నగారి బావికి వాకింగ్ ట్రాక్, ప్రహరి, స్టైంచ్, ఫార్మేషన్ రోడ్డు, విద్యుత్ దీపాలు తదితర పనులు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. త్వరలో బావి పూర్తిస్థాయి సుందరీకరణతో పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఎంపీడీవో నరేష్, కాంగ్రెస పార్టీ మండల అధ్యక్షుడు నారాగౌడ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

హనుమాన్ ఆలయంలో జలాభిషేకం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : మండలంలోని సోమారంపేట్ గ్రామస్తులు శనివారం హనుమాన్ ఆలయంలో జలాభిషేకం చేశారు. సరిపడా వర్షాలు లేకపోవడంతో పంటలు ఎండుతున్నాయని వర్షాలు కురవాలని కోరుతూ గ్రామస్తులు చెరువులో నుంచి బిందెల ద్వారా నీటిని తీసుకొచ్చి హనుమాన్ ఆలయంలో జలాభిషేకం చేశారు.

సలాబత్‌పూర్ ఆలయానికి పాదయాత్ర



మద్నూర్ : మండలంలోని మేనూర్ నుంచి సలాబత్‌పూర్ హనుమాన్ మందారానికి శనివారం భక్తులు పాదయాత్రగా వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రావణ శనివారం పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రతి ఏడు గ్రామం నుంచి బయటుదేరి వెళ్తుందన్నారు.

వీరాంజనేయస్వామి ఆలయానికి..



నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని చంద్రమౌళీశ్వరాలయం నుంచి శనివారం హనుమాన్ భక్తులు తిమ్మారెడ్డి వీరాంజనేయస్వామి ఆలయానికి పాదయాత్రగా చేశారు. శ్రావణ మాసం మూడో శనివారం సందర్భంగా భక్తులు శ్రీరామ నామస్మరణతో హనుమాన్ ఆలయానికి పాదయాత్రగా తరలివెళ్లారు.

ఆలయాల్లో భక్తుల సందడి



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని దుర్కిలో ఉన్న సోమేశ్వర ఆలయం, మైలారంలో ఉన్న రాజ రాజేశ్వర ఆలయం, బైరాపూర్‌లోని విఠలేశ్వర ఆలయంలో శనివారం భక్తులు సందడి నెలకొంది. ఆలయాల్లో భక్తులు అన్నదానం నిర్వహించారు. బైరాపూర్ ఆలయంలో ప్రతి సోమవారం, శనివారం అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

గుజరాత్ నుంచి శ్రీశైలానికి సైకిల్‌యాత్ర



మద్నూర్ : గుజరాత్ నుంచి శ్రీశైలం వెళ్తున్న గోవింద్‌ను మద్నూర్ మండల కేంద్రానికి చెందిన హన్మాండ్లు అనే యువకుడు కలిశాడు. ఆయన గుజరాత్ రాష్ట్రానికి చెందిన వారిని రెణ్నెళ్లుగా సైకిల్‌పై ప్రయాణిస్తున్నట్లు తెలిపారన్నారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించినట్లు వారు తెలిపారు.

వేంకటేశ్వరాలయంలో సత్యనారాయణ వ్రతాలు



పిట్లం(జుక్కల్) : మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయంలో శనివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు మారుతి రెడ్డి మాట్లాడుతూ శ్రావణ శనివారం సందర్భంగా ఆలయంలో 108 దంపతులు సామూహిక సత్యనారాయణ వ్రతాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారన్నారు. అనంతరం అన్నదానం చేశారు.

ఘనంగా లక్ష పుష్పార్చన



మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రావణ మాసం మూడో శనివారం సందర్భంగా స్వామివారిని అభిషేకించి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, ఈవో శ్రీధర్, సిబ్బంది సంతోష్, సురేందర్‌గుప్త, ప్రసాద దాతలు ఉమారాణి సురేందర్ అర్చకులు నర్సింహచార్యులు, శ్రీనివాసచార్యులు, పరంధాములు పాల్గొన్నారు.

శివాలయంలో అన్నదానం



బాన్సువాడ : శ్రావణ మాసం పురస్కరించుకుని శనివారం పట్టణంలోని పాత బాన్సువాడ శివాలయంలో అన్నదానం నిర్వహించారు. ఓట్లం పరమేశ్వర ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శివుడికి తీర్థ ప్రసాదాలు నైవేద్యంగా పెట్టారు. అన్నదానం నిర్వహించారు.

పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు



లింగారెడ్డిపేటలో కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు



భిక్కనూరులోని విజ్ఞాన్ పాఠశాలలో..



తాడ్వాయిలోని రవీంద్రభారతి పాఠశాలలో..



లింగంపేటలో ఉట్టి కొడుతున్న చిన్నికృష్ణులు



నాగిరెడ్డిపేటలోని పాఠశాలలో..



కామారెడ్డి పట్టణంలో..

జిల్లాలోని ఆయా పాఠశాలల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు గోపిక, చిన్నికృష్ణుల వేషధారణలో అలరించారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



నిజాంసాగర్‌లోని మంజీరా పాఠశాలలో..



దోమకొండలోని గడికోటలో..



రాజంపేటలో శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో..



మాచారెడ్డిలో గోపికలు, కృష్ణుడి వేషధారణలో..



రామారెడ్డి మండలంలోని గిద్ద పాఠశాలలో..



ఎల్లారెడ్డిలోని బ్రిలియంట్ పాఠశాలలో..



సదాశివనగర్‌లోని శ్రీవాణి విద్యాలయంలో..

రేషన్‌షాప్ ఏర్పాటు చేయాలి



భిక్కనూరు : మండలంలోని తిప్పాపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ కాలనీ యువజన సంఘం ప్రతినిధులు శనివారం భిక్కనూరు తహసీల్దార్ శివప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ కాలనీవాసులు రేషన్ బియ్యం కోసం కి.మీ దూరంలో ఉన్న తిప్పాపూర్ గ్రామంలోకి వెళ్లి తీసుకొస్తున్నారని దీని వల్ల వృద్ధులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ యువత అధ్యక్షుడు ప్రభాకర్ ప్రతినిధులు రజనీకాంత్, కాశిగల్ల స్వామి, భరత్, లక్ష్మణ్, సంతోష్, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీ పార్క్ ఏర్పాటుకు వినతి



భిక్కనూరు : కామారెడ్డి ప్రాంతంలో ఐటీ పార్క్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్ బాబును కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి శనివారం కోరారు. ఈ మేరకు ఇంద్రకరణ్ రెడ్డి హైదరాబాద్‌లో మంత్రి శ్రీధర్‌బాబును కలిసి కామారెడ్డి ప్రాంతం ఐటీ రంగానికి అనుగుణంగా ఉంటుందని ఈ ప్రాంతంలో ఐటీపార్క్ ఏర్పాటు చేస్తే ఎంతో మేలు కలుగుతుందన్నారు. హైదరాబాద్‌కు 120 కి.మీ దూరంలో ఉన్న ఈ ప్రాంతం ఐటీపార్క్ ఏర్పాటు వల్ల వేగవంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబును శాలువతో సన్మానించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ అన్నారు. మండలంలోని చందాపూర్‌లో శనివారం పర్యటించారు. గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో, రోడ్లకిరువైపులా చెత్తచెదారం, పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేయాలన్నారు. వాగువద్దకు వెళ్లి పరిశీలించారు. వాగువద్ద ఏపుగా పెరిగినా పిచ్చిమొక్కలను తొలగించి వర్షం నీరుపోయేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ పెద్దలు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

లింగంపేటలో..

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలో పొల్కంపేట, అయ్యపల్లి తండా, లింగంపేట గ్రామాల్లో పారిశుధ్యం పనులు చేశారు. ఈ సందర్భంగా జీపీ సిబ్బంది, కూలీలు రోడ్ల పక్కన పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, పూడిక తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మలహరి, కార్యదర్శులు అశ్వక్, శ్రావణ్‌కుమార్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు


మద్నూర్ : మండలంలోని చిన్న తడ్గూర్‌లో శనివారం సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ నాయకత్వంలో జుక్కల్ నియోజక వర్గం అభివృద్ధిలో ముందు వరుసలో దూసుకుపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధరార్ సాయిలు, చౌలావర్ హన్మాండ్లు, స్వామి, మాజి ఎంపీపీ రాం పటేల్, ప్రజ్ఞ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఎల్లారెడ్డి ఏడీఏగా లక్ష్మీప్రసన్న

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి ఏడీగా లక్ష్మీప్రసన్న శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎల్లారెడ్డి ఇన్‌చార్జి ఏడీఏగా ఉన్న వీరాస్వామి బదిలీ కావడంతో ఆయన స్థానంలో కామారెడ్డి నుంచి లక్ష్మీప్రసన్న ఇన్‌చార్జి ఏడీఏగా బాధ్యతలు స్వీకరించారు.

సెల్‌ఫోన్ల అప్పగింత



మాచారెడ్డి : పోగొట్టుకున్న నాలుగు సెల్ ఫోన్లను శనివారం సీఈఐఆర్ ద్వారా ట్రేస్‌చేసి బాధితులకు మాచారెడ్డి ఎస్సై అనిల్ తెలిపారు. పాల్వంచ మండలం ఫరీద్‌పేట గ్రామానికి చెందిన సత్యం, భవానీపేట లక్ష్మణ్, సదాశివనగర్ మండలం కుప్రియాల్‌కు చెందిన రేవతి, మాచారెడ్డి మండలం ఘన్‌పూర్ గ్రామానికి చెందిన లక్ష్మణ్‌కు సెల్ ఫోన్లను అప్పగించారు.

వాహనాల తనిఖీలు



భిక్కనూరు : దోమకొండ సబ్‌డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో భిక్కనూరు మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై శనివారం ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. సీఐ సంపత్ ఆధ్వర్యంలో ఎస్సై సాయికుమార్‌తో పాటు దోమకొండ సబ్ డివిజన్ పోలీసులు వాహనాల తనిఖీతో పాటు డ్రంక్‌అండ్ డ్రైవ్ పరీక్షలను నిర్వహించారు.

సంఘాలు మరింత బలోపేతం కావాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : గ్రామాల్లో అర్హులైన సంఘాలకు రుణాలు ఇప్పించి, ఆ సంఘాలు మరింత బలోపేతమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఐకేపీ ఏపీఎం రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో శనివారం మండల సమాఖ్య అధ్యక్షురాలు యశోదబాయి అధ్యక్షతన మండల సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో సీసీలు, అకౌంటెంటు, మండల సమాఖ్య పాలక వర్గం సభ్యులు, సంఘాల అధ్యక్షులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌గా బాధ్యతల స్వీకరణ

బిచ్కుంద(జుక్కల్) : ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా అశోక్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ప్రిన్సిపాల్ చంద్రముఖర్జీ 15 రోజుల క్రితం బదిలీపై వెళ్లారు. కళాశాలలో సీనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న అశోక్‌ను ఉన్నతాధికారులు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు అప్పగించారు.

సైబర్ మోసగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి

మాచారెడ్డి : సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాచారెడ్డి ఎస్సై అనిల్ అన్నారు. శనివారం మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతూ మోసగాళ్లు రోజుకోవిధంగా నూతన పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారని వీరితో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఓటీపీలు చెప్పవద్దని, పోలీసులమని, ఐటీ అధికారులమని, మీ కుటుంబసభ్యులు అరెస్ట్ అయ్యారంటూ తప్పుడు ఫోన్లు చేస్తున్నారని అలాంటి కాల్స్‌ను మోసపోవద్దన్నారు. వెంటనే 100కు ఫోన్ చేయాలన్నారు.